సూఫీ, భక్తి ఉద్యమాలు.. ఇండో పర్షియన్ సంస్కృతి

ప్ర:భక్తి ఉద్యమ స్వభావం, ప్రాముఖ్యాన్ని వివరించండి?

జ: మధ్యయుగాల్లో దక్షిణాదిన ప్రారంభమైన భక్తి భావన ఉత్తరాదిన గొప్ప ఆధ్యాత్మిక చైతన్యాన్ని సామాజిక ప్రభావాన్ని కలిగించింది.

భక్తి ఉద్యమం ప్రధానంగా హిందూ సమాజంలోని కొన్ని రుగ్మత లను నివారించడంతోపాటు ఇస్లాం ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు మతాంతరీకరణలను అరికట్టేందుకు ప్రయత్నించింది. అలాగే హిందూ-ముస్లిం సమజాల మధ్య సమన్వయాన్ని సాధించేందుకు కూడా కృషి చేసింది. భక్తి ఉద్యమకారులు కర్మకాండల కంటే భగవం తుని పట్ల భక్తి ప్రవత్తులే మోక్షానికి మార్గమని ప్రచారం చేశారు. ఆచా రాల కంటే హృదయ స్వచ్ఛత, దయ సౌశీల్యానికే ప్రాధాన్యమిచ్చారు. దేవాలయాలలో అర్చనలు వంటి వాటిని నిరసించారు. మూఢ విశ్వా సాలను ఖండిస్తూ కొంత మేరకు హేతువాద వైఖరి ప్రదర్శించారు. ఇందుకు కబీర్, నానక్‌లను ప్రతీకలుగా పేర్కొనవచ్చు. భక్తితోపాటు గురువుకు కూడా ప్రాధాన్యమిచ్చారు. కుల-మత బేధాలను నిరసిం చారు. భజనలు, కీర్తనలు, పాటలు వంటి ప్రక్రియలకు ప్రాధాన్యమి చ్చారు. ప్రజల భాషలో ప్రచారం చేస్తూ ప్రాంతీయ భాషల అభివృద్ధికి దోహదపడ్డారు. హిందు, ముస్లిం సమాజాల మధ్య అవగాహన పెంచేందుకు ప్రయత్నించారు.ఎందరో ఉద్యమకారులు, వారి శిష్యులు నిమ్న కులానికి చెందిన వారేకావడం ఆసక్తికర విషయం. భక్తి ఉద్యమకారులు శిష్యులలో హిందూవులతోపాటు ముస్లింలు కూడా ఉండటం వారి పరమత సహనాన్ని సూచిస్తుంది.

ప్రభావం లేదా ప్రాముఖ్యం:

మతం సంక్షిప్త స్వరూపాన్ని భక్తి ఉద్యమకారులు కొంత మేరకు సరళం చేయగలిగారు. పూజారుల ప్రాధాన్యాన్ని తగ్గించగలిగారు. మతం పూర్తిగా వ్యక్తిగతమైందనే భావనను ప్రచారం చేయగలిగారు.

నిరాడంబరత, దయ, సర్వ మానవ సోదరత్వం వంటి భావన లను ప్రచారం చేశారు.ప్రాంతీయ భాషల అభివృద్ధికి దోహదపడ్డారు. రామానందుడు, కబీర్ వంటి వారు హిందీలో, చైతన్యుడు బెంగా లీలో, నర్సీ మెహతా గుజరాత్‌లో, మీరాబాయ్ బ్రజ్ భాషలో రాజ స్థాన్, గుజరాత్‌లలో ప్రచారం చేయడమేకాకుండా అక్కడి స్థానిక భాషల అభివృద్ధికి తోడ్పడ్డారని చెప్పొచ్చు.

కులవ్యవస్థ కాఠిన్యాన్ని కొంత మేరకు తగ్గించగలిగారు. కొన్ని ప్రాంతాల్లో నిమ్న కులాలు భక్తి ఉద్యమాల ఆసరాగా సామాజి కంగా తమ ప్రాముఖ్యతను పెంచుకున్నాయి. మధ్యయుగాల్లో ప్రధానంగా నిర్గుణ వాదుల కృషి వల్ల ఇస్లాం-హిందూ మతాల మధ్య అవగాహన సమన్వయం పెరిగాయని చెప్పొచ్చు. భక్తి ఉద్యమాల్లో ఆవిర్భవించిన సిక్కులు, మరాఠాలు రాజకీయ శక్తులుగా ఎదిగి భారతదేశ చరిత్రను ప్రభావితం చేశారు.

పరిమితులు: భక్తి ఉద్యమకారులు ఎంత ప్రయత్నించినప్ప టికీ..సామాజిక, మత రుగ్మతలు కొనసాగాయనే చెప్పా చ్చు. విగ్రహా రాధన, పూజారుల ప్రాబల్యం, మూఢవిశ్వాసాలు, బహుదేవతారా ధన వంటి అంశాలు హిందూ మతంలో ఆధునిక యుగం వరకు కొనసాగాయి. ఉదారవాద ఉద్యమాలుగా మొదలైన కొన్ని శాఖలు ప్రత్యేక మత శాఖలుగా ఏర్పడటం కూడా ఒక లోపంగానే భావించ వచ్చు. కబీర్ పంథీయులు, శిష్యులు ఆయన మరణానంతరం హిందూ-ముస్లిం ప్రతిపాదికన చీలిపోవడం విషాదం. అలాగే అన్ని మ తాల బోధనలను సమ్మిళితంతో నానక్ చేసిన బోధనలు సిక్కు మత రుపాన్ని సంతరించుకున్నాయి. ఆ మతస్థులకు ప్రత్యేకమైన ఆచార, విశ్వాసాలు ఏర్పడ్డాయి. వల్లభాచార్యుని శిష్యులు తర్వాతి కాలంలో సుఖవాదులుగా మారిపోయారు.

భక్తి ఉద్యమం ఎలాంటి చారిత్రక ప్రయోజనాలను సాధించదనే అంశాన్ని పక్కనపెడితే ఒక తాత్విక శక్తిగా దాని ప్రభావం భారతీయ సంస్కృతిపై ఇప్పటికీ కనిపి స్తుంది. ఆధునిక యుగంలో భక్తి ఉద్యమ కారులు చెప్పిన వినయం, ప్రేమ, భక్తి వంటి అంశాలను తనలో మేళ వించుకున్న వైష్ణవ సంప్రదాయానికి చెందిన వ్యక్తిగా మహాత్మ గాంధీలో భక్తి ఉద్యమ ప్రభావాన్ని గమనించవచ్చు.

ప్ర:సూఫీ, భక్తి ఉద్యమాల మధ్య పోలికలను వివరించండి?

జ: మధ్యయుగాల్లో తలెత్తిన సూఫీ, భక్తి ఉద్యమాల మధ్య ఎన్నో అంశాల్లో పోలికలు కనిపిస్తున్నాయి.

- రెండు ఉద్యమాలు ఉదారవాద ఉద్యమాలే. మతానికి సరళమైన వ్యాఖ్యానం చేయడానికి ప్రయత్నించాయి.
- మతంలో కర్మకాండలు, ఆచారాల కంటే దేవుడిపట్ల ప్రేమ, భక్తి ముఖ్యమని ఇద్దరూ ప్రచారం చేశారు.
- సూఫీ, భక్తి ఉద్యమకారులు అందరూ సోదర సమానులేనని ప్రచారం చేశారు. సామాజిక,ఆర్థిక బేధాలను నిరసిస్తూ దేవుని దృష్టిలో అందరూ సమానులే అని వాదించారు.
- ఆధ్యాత్మిక పురోగతికి కుటుంబ జీవితం ఆటంకం కాదని దైవచిం తన పేరుతో జీవితం గడపనక్కర్లేదని విశ్వసించారు. సూఫీలు ఎందరో నేత పనివారుగా, రైతులుగా పని చేశారు. అలాగే భక్తి ఉద్యమకారుల్లో చర్మకారులు, నేత పనివారు, రైతులు, క్షురకులు, దర్జీలు వంటి వారు కూడా ఉండేవారు.
- సూఫీ సన్యాసులు అధికార భాష పర్షియన్ అయినప్పటికీ.. ప్రజల భాషనే వినియోగించేందుకు ప్రయత్నించారు. మాలిక్, మహ్మద్ జాయసీ, కుత్బాన్ వంటి సూఫీలు హిందువుల నమ్మకాలపై, కథ లను గురించి హిందీలో రచనలు చేశారు. సూఫీలు హిందీలో బోధ నలు సాగించడం వల్ల హిందువుల కూడా వారి శిష్యులయ్యారు.
- భక్తి ఉద్యమకారులు కూడా సంస్కృతాన్ని విడనాడి హిందీ, బెంగాలీ, అస్సామీ, మరాఠీ, గుజరాతీ, రాజస్థానీ వంటి ప్రాంతీయ భా షలనే స్వీకరించారు. ఇరువురూ హిందూ-ముస్లిం సమాజాల

మధ్య అవగాహన కోసం భావ సమైక్యతకు తోడ్పడ్డారు.

ప్ర:భారతదేశంలో ఇండో-పర్షియన్ వాస్తు కళ ఎలా అభివృద్ధి చెందిందో తెలపండి? లేదా ఢిల్లీ సుల్తానుల కాలంలో అభివృద్ధి చెందిన వాస్తు కళా విశేషాలను చర్చించండి?

జ: భారతదేశంలో తురుష్కులు ప్రవేశించేనాటికే పర్షియన్ సంస్కృతి ప్రభావం బలంగా ఉండేది. ఇస్లామిక్ వాస్తు కళ పర్షియన్ ప్రభావానికి గురికావడంతోపాటు దేశీయ వాస్తుశైలితో మిళితం కారణంగా ఏర్పడిన శైలిని ఇండో-పర్షియన్ వాస్తు శైలిగా వ్యవహరించేవారు.

దేశీయ వాస్తుశైలిలో చదునైన పైకప్పును శ్లాబ్ అండ్ బీమ్ పద్ధతిలో నిర్మించేవారు. ఇస్లామిక్ వాస్తులో కమాన్లు, గుమ్మటాలు, మినార్లుగా పిలిచే స్తంభాల వంటి నిర్మాణాలు ముఖ్యమైనవి. సుల్తానుల కాలంలో వాస్తు ఈ రెండు లక్షణాలను మిళితం చేసుకుని పురోగమించింది. ముస్లింలు భవన నిర్మాణంలో బలమైన మోర్టార్‌ను వాడే పద్ధతితోపాటు అలంకరణలో అరబెస్క్యూనూ జ్యామితీయ నమూనాలను ప్రవేశపెట్టారు. సుల్తాన్ యుగంలోని వాస్తుశైలిని మూడు దశలుగా విభజించవచ్చు.

తొలిదశ(బానిస వంశం, ఖిల్జీ వంశం): భారత్‌లోకి కుతుబుద్దీన్ ఐబక్ ప్రవేశించాక కువ్వాత్ ఉల్ ఇస్లాం మసీదు(ఢిల్లీ), అధయ్ దిన్ కా జోంఫ్రా(అజ్మీర్)ను నిర్మించాడు. తర్వాత కుతుబ్‌మినార్ నిర్మాణాన్ని ప్రారంభిస్తే.. ఇల్‌టుట్‌మిష్ దాన్ని పూర్తి చేశాడు. ఎరుపు రంగు ఇటుక రాయితో నాలుగు అంతస్తులతో దీన్ని నిర్మించారు. ఈ నిర్మాణంలో పైకి వెళ్లేందుకు వృత్తాకారపు మెట్లు, ప్రతి అంతస్తులోను గ్యాలరీలు కనిపిస్తాయి. బాల్బన్ సమాధిలో నిజమైన కమాన్ దర్శనమిచ్చింది. ఖిల్జీలు శాస్త్రీయమైన గుమ్మటాలను రూపొందించారు. అల్లా ఉద్దీన్ ఖిల్జీ కుతుబ్ భవన సముదాయానికి దగ్గర్లో సిరి అనే పట్టణాన్ని నిర్మించాడు. ఖిల్జీ కట్టడాల్లో అలై దర్వాజా ప్రత్యేకమైంది. చతురస్రాకార నిర్మాణంతోపైన గుమ్మటాన్ని కలిగి ఉంటుంది.

తుగ్లక్ దశ: ఆడంబరం కంటే సౌకర్యానికి ప్రాధాన్యమివ్వడం, భవనాల్లో నిరాడంబరత వీరి ముఖ్య లక్షణం. తుగ్లక్‌లు తొలిదశలో ఏటవాలు గోడలతో కూడిన భవనాలను నిర్మించారు. ఫిరోజ్‌షా తుగ్లక్ కాలంలో కమాన్లు, గుమ్మటాలను దేశీయ స్లాబ్ అండ్ బీమ్ పద్ధతిలో మిళితం చేసిన లక్షణం కనిపిస్తుంది. ఇందుకు ప్రసిద్ధ ఉదాహరణ: హౌజ్‌కాస్ నిర్మాణం. తుగ్లక్‌లు పద్మం వంటి హిందూ ప్రతీకలను స్వీకరించారు. అష్టభుజ ప్రణాళికను భవన నిర్మాణంలో అనుసరించారు.

మూడో దశ: సయ్యద్‌లు, లోడీలు ఆ తర్వాత ప్రాంతీయ రాజ్యాల అభివృద్ధికి సంబంధించిన దశ. సయ్యద్ పాలకుడు ఖిజిర్ ఖాన్ ..ఖిజిరాబాద్, ముబారక్ షా, ముబారకాబాద్ అనే పట్టణ సముదాయాలను, సికిందర్‌లోడి ఆగ్రాను నిర్మించాడు. లోడీలు ఎత్తైన వేదికలపై సమాధులను తీర్చిదిద్దారు. కొన్ని సందర్భాల్లో తోటల మధ్య కూడా సమాధులను రూపొందించారు.

ఢిల్లీ సుల్తానత్ పతనమైన తర్వాత ఇండో పర్షియన్ వాస్తు శైలి వివిధ ప్రాంతాలకు వ్యాపించి.. అనేక ప్రాంతీయ శైలీల ఆవిర్భవానికి దోహదం చేసింది. బెంగాల్, గుజరాత్, జైపూర్, మాళ్వా శైలులు చెప్పుకోదగ్గవి.

బెంగాల్: నిర్మాణాల్లో రాయి లభ్యత తక్కువగా ఉండటంతో ఇటుకలను ప్రధానంగా వినియోగించేవారు. కమాన్లు, గుమ్మటాలు వంటి లక్షణాలను హిందూ దేవాలయాల్లో కనిపించే చతురస్రాకారపు లఘు స్తంభాలను జోడించారు. బెంగాల్ శైలికి ఉదాహరణలుగా పాండువాలోని అదీనా మసీదు, గౌర్‌లోని ధాఖిలీ దర్వాజా బారాసోనా మసీదు, చోటా సోనా మసీదు వంటివి.

గుజరాత్: అహ్మద్‌షా అహ్మదాబాద్ పట్టణాన్ని నిర్మించాడు. ఇక్కడ కూడా ఇస్లామిక్ వాస్తు లక్షణాలను దేశీయ లక్షణాలైన స్తంభాల నిర్మాణం వంటి అంశాలతో జతపరిచారు.చంపానీర్‌లోని జామా మసీదు పొడవైన స్తంభాలు, 15 గుమ్మటాలతో ప్రత్యేకంగా కనిపిస్తుంది. గుజరాతీ శైలీలో రాజపుత్ర శైలికి సంబంధించిన చిన్న మండపాలు, బాల్కనీలు వంటి నిర్మాణాలు చోటు చేసుకున్నాయి.

జౌన్‌పూర్: షర్కీ వంశస్తులు జౌన్‌పూర్‌ను రాజప్రసాదాలు, మసీదులు, మదర్‌సాలతో అందంగా తీర్చిదిద్దారు. ఇక్కడ కూడా ఇస్లామిక్ శైలి దేశీయ శైలితో మిళితమైంది. మసీదులకు మీనారులు లేకపోవడం ఇక్కడి ప్రత్యేక లక్షణం. ఈ శైలికి అతలాదేవి మసీదు ఒక ఉదాహరణ.
మాళ్వా: ఇక్కడ కూడా ఇస్లామిక్, దేశీయ వాస్తు శైలుల సమ్మేళనం కనిపిస్తుంది. మండూ వద్ద గల హుషంగ్‌షా సమాధి భవన నిర్మాణంలో పాలరాయిని వాడారు. ఇంకా హిందోలా మహల్, జహాజ్ మహల్, బాజ్ బహదూర్, రూపమతి భవనాలు ఈ శైలికి ఉదాహరణాలు.

మధ్య ఆసియా ప్రభావంతో భవన నిర్మాణంలో వెదురును వాడారు. శ్రీనగర్‌లోని జామా మసీదు ఈ శైలికి ఉదాహరణ. ఇంకా దక్కన్‌లో బహుమనీలు కూడా ఇండో పర్షియన్ శైలిని అభివృద్ధి చేశారు. గుల్బార్గాలోని మసీదు, బీదర్‌లోని మదర్సా, బీజాపూర్‌లోని గోల్‌గుంబజ్ బహమనీయుల నిర్మాణాల్లో చెప్పుకోదగినవి.

ప్ర:ఢిల్లీ సుల్తానుల కాలంలో కళల అభివృద్ధిని వివరించండి?

జ: ఢిల్లీ సుల్తానుల కాలంలో వాస్తు కళ, సంగీతం, సాహిత్యాల్లోను అభివృద్ధి చోటుచేసుకోవడమే కాకుండా సాంస్కృతిక సమైక్యతకు కూడా దోహపడింది.

వాస్తుకళ: తురుష్కులు పర్షియన్ ప్రభావం ఉన్న ఇస్లామిక్ వాస్తు కళను భారతదేశానికి పరిచయం చేశారు. కమాన్లు, గుమ్మటాలు, మినార్లు, భవన నిర్మాణానికి మెరుగైన సామగ్రిని ఉపయోగించారు. అలంకరణలో అరబెస్క్యూనూ, జ్యామితీయ నమునాలను వాడటం వంటి అంశాలను ప్రవేశపెట్టారు. ఈ కాలం నాటి వాస్తు నిర్మాణాల్లో తొలి దశలో కుతుబ్‌మినార్, అలైదర్వాజాలు ప్రత్యేకమైనవి. తుగ్లక్ కాలంలో కమాన్లు, గుమ్మటాలు పద్ధతిని శ్లాబ్ అండ్ బీమ్ పద్ధతిలో

కలపడం హౌజ్‌ఖాస్ వంటి నిర్మాణాలలో కనిపిస్తుంది. లోడీలు తోటల మధ్యలో ఎత్తైన వేదికలపై సమాధులను నిర్మించారు.

ఢిల్లీ సుల్తానత్ పతనమయ్యే దశలో ఆ వాస్తు శైలి బెంగాల్, గుజరాత్, జౌన్‌పూర్, మళ్వా వంటి ప్రాంతాలకు విస్తరించి పలు ప్రాంతీయ శైలుల ఆవిర్భవించాయి. ఈ శైలిలో కమాన్లు, గుమ్మటాలను, దేశీయ శైలిలోని స్తంభాలను కలిపి నిర్మించే పద్ధతి వ్యాప్తిలోకి వచ్చింది.

సాహిత్యం: ఆరబిక్ భాష ప్రధానంగా ఇస్లామిక్ న్యాయశాస్త్రాలకు, మత గ్రంధాలకు మాత్రమే పరిమితమైంది. తరుష్కులు భారతదేశంలో పర్షియన్ భాషను విరివిగా ప్రచారం చేశారు. ఈ భాషకు లాహోర్ ప్రధాన కేంద్రంగా వర్ధిల్లింది. పర్షియన్ భాషలో సుల్తానత్ యుగంలో అమీర్ ఖుస్రో ప్రసిద్ధ రచయిత. ఆయన పర్షియన్ కావ్య శైలిలో ప్రయోగాలు చేసి సబక్-ఆ-హింద్ అనే భారతీయ శైలిని రూపొందించాడు. ఇదే సమయంలో ఎన్నో సంస్కృత రచనలను పర్షియన్‌లోకి అనువదించారు. ఫిరోజ్‌షా తుగ్లక్ కాలంలో సంస్కృతం నుంచి వైద్య, సంగీత రచనలను పర్షియన్‌లోకి తర్జుమా చేశారు.

ఖిల్జీల కాలంలో దక్కన్ ప్రాంతంలో ఉర్దూ ఆవిర్భవించింది. క్రమంగా కావ్య, పరిపాలనా భాషగా ఉర్దూ ప్రచారంలోకి వచ్చింది. మధ్యయుగాల తొలి దశలోనే పంజాబీ, హిందీ, బెంగాల్, మరాఠీ వంటి ప్రాంతీయ భాషలు పరిపక్వతకు చేరి అద్భుత సాహిత్య సృష్టికి దోహదం చేశాయి.

సుల్తానత్ యుగంలో చరిత్ర రచన ముఖ్యంగా పర్షియన్ భాషలో వర్ధిల్లింది. మిన్‌హజ్-ఉస్-సిరాజ్ బరానీ రచించిన తబకాత్-ఇ-నాసిర, తారీక్-ఇ-ఫిరోజ్‌షాహీ పేరుతో జియా ఉద్దీన్ బరానీ, షామ్స్-ఇ-సిరాజ్ ఆఫేఫ్ రచించిన గ్రంధాలు ఈసామీ రచించిన పుత్-ఉస్-సలాటిన్ వంటివి ప్రముఖ ఉదాహరణలు.

సంగీతం: తురుష్కులు పర్షియన్ సంగీత సాంప్రదాయాలతోపాటు ఎన్నో కొత్త స్వరాలు, వాద్యపరికరాలను ప్రవేశ పెట్టారు. రబాబ్ సారంగి వంటి వాద్య పరికరాలను ప్రవేశపెట్టారు. అమీర్ ఖుస్రో అయినమ్, సనమ్, ఘోరా వంటి పర్యాయ అరబిక్ రాగాలను పరిచయం చేశాడు. ఈ నేపథ్యంలోనే హిందుస్థానీ సంగీతం ఆవిర్భవించింది. హుస్సేన్ షా షర్కీ ఖయాల్‌ను అభివృద్ధి పరిచాడు. పీర్‌బోధన్ అనే సూఫీ సన్యాసి సంగీతాన్ని విరివిగా ప్రచారం చేశాడు. ఫిరోజ్‌షాతుగ్లక్ కాలంలో రాగర్పణ్ అనే సంస్కృత సంగీత రచనను పర్షియన్‌లోకి అనువదించారు. ఈ కాలంలో కూడా అప్పటి వరకు ప్రచారంలో ఉన్న లఘు చిత్ర కళ కొనసాగింది.